క్లుప్తంగా

ధ్యాన కేంద్రానికి రూ. 25వేలు విరాళం



దాత పార్థసారథినాయుడును సన్మానిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్: నగరంలోని గిరింపేటకు చెందిన పీవీకేఎస్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్రానికి ఆదివారం దాత పార్థసారథి నాయుడు రూ.25వేలు విరాళం అందజేశారు. ఈ నగదును వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి శివశంకర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతను అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాజశేఖర్, రమేష్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

నేడు కమ్మతిమ్మాపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్

గుడిపాల: మండలంలోని కమ్మతిమ్మాపల్లెలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత తెలిపారు. ఉదయం 10 గంటలకు కమ్మతిమ్మాపల్లె గ్రామంలో వైద్యసేవలు అందజేయనున్నట్లు తెలిపారు. నడవలేని వారికి ఇంటివద్దనే వెళ్లి వైద్యం అందిస్తామని చెప్పారు.

మట్టి తరలింపును అడ్డుకోండి



చీకూరుపల్లె మంచినీటి కుంటలో జేసీబీతో మట్టితీస్తున్న దృశ్యం

బంగారుపాళెం: మండలంలోని చీకూరుపల్లె పంచాయతీ పరిధిలోని మంచినీటికుంటలో మట్టి తరలింపును అధికారులు అడ్డుకోవాలని గ్రామస్తులు తెలిపారు. గత 15 రోజులుగా మంచి నీటికుంటలో అనధికారికంగా మట్టిని తరలిస్తుంచేస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన వ్యక్తి జేసీబీతో అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులెవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారికంగా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



శాంతినగర్‌లో భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ శాంతినగర్‌లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై బంగారుపాళెం కమిటీ–2 సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ మాట్లాడుతూ, సమాజంలో కులమతాలను రూపు మాపి, ప్రజల మధ్య నెలకొన్న అసమానతలను తొలగించడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తోందన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవంలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

గుడుపల్లె: గుడివంక శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. గుడివంక ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయఆవరణలో పచ్చటి పందిరి వేసి విద్యుత్ దీపాలతో కల్యాణ వేదికను తీర్చిదిద్దారు. శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి, వేదికపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల హోరు, వేద మంత్రోచ్ఛరణ నడుమ పండితులు హోమాలు చేసి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారికి మంగళ హారతులు సమర్పించిన అనంతరం ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు

కుప్పం రూరల్: చరాచర జగత్తుకు శ్రీకృష్ణుడు ఒక్కడే గురువని ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో బోధపడుతుందని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గరిగచీనేపల్లెలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ, గుం(డ్రం)–అనే పదం నుంచే గురువు అనే అర్థం ఉద్భవించిందని, చరాచర జగత్తుకు శ్రీకృష్ణ పరమాత్ముడే గురువని పేర్కొన్నారు. ప్రబోధానంద రచనలను గ్రామ ప్రజలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, కృష్ణారెడ్డి, నాగరాజు, శరవణ, చరణ్ పాల్గొన్నారు.

గోరుముద్ద కొండంత బలం

- ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరంగా మధ్యాహ్నభోజనం
- అదనంగా రాగిజావ అందిస్తున్న వైనం
- ఇష్టంగా స్వీకరిస్తున్న విద్యార్థులు



ఏఎల్‌పురం పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



నరహరిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



గట్రాళ్లమిట్ట పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

గుడిపాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనూ రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో జగనన్న గోరుముద్దను అమలు చేస్తోంది. విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు రాగిజావను సైతం అందిస్తోంది. దీంతో విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

అభిరుచులకు అనుగుణంగా...

మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 53 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,388 మంది విద్యార్థులు ఉండగా ప్రతిరోజూ 2,190 మంది మధ్యాహ్న భోజనం ఇష్టంగా పాఠశాలలోనే తింటున్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకొచ్చింది. ఎప్పటికప్పుడు పిల్లలు, విద్యాశాఖ అభిప్రాయాలను సేకరిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సరిగ్గా సాంబారన్నం తినకపోవడంతో నిమ్మకాయ పులిహోర(చిత్రాన్నం)ను మెనూలో చేర్చారు. నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. నిత్యం ఆయా పాఠశాలల్లో ముందుగా ఉపాధ్యాయుడు వెళ్లి పరిశీలించిన అనంతరమే విద్యార్థులకు భోజనం అందించడం విశేషం.

మెనూ వివరాలు

సోమవారం	హాట్‌పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డుకూర, చిక్కీ
మంగళవారం	పులిహోర, టమాటాపచ్చడి, దొండకాయపచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం	వెజిటేబుల్ బిర్యానీ, ఆలుకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	సాంబార్‌బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	ఆకుకూర, సాంబార్, తీపి పొంగల్, రాగిజావ

నెలకు నాలుగు సార్లు గుడ్లు

గతంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు నెలకు మూడుసార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు. దీంతో కొన్నిచోట్ల గుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. ఇది గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగుసార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లను అదే వారంలో వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు వారానికి అయిదు గుడ్లు ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యంలోనే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు చెబుతున్నారు.

భోజనం రుచిగా ఉంటుంది



నేను ప్రతిరోజు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తింటున్నాను. వారంలో అయిదు రోజులు కోడి గుడ్లు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో కన్నా మా పాఠశాలలోనే బావుంటుంది. విద్యార్థులందరం స్కూల్లోనే తింటున్నాం.

– మనోజ్, 8వ తరగతి, కేటీపల్లె

రోజూ పాఠశాలలోనే తింటా



గతంలో మధ్యాహ్న భోజనం సరిగ్గా తినేవాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉంటుండడంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాను. ఇంట్లో భోజనం లాగే ఉంటుంది. రోజుకో ఉపాధ్యాయుడు వెళ్లి భోజనం పరిశీలించి మాకు అందజేస్తారు. రాగిజావ ఎంతో చాలా బావుంది.

– కీర్తిక, 9వ తరగతి, కమ్మతిమ్మాపల్లె

ఇష్టంగా తింటున్నారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దగా పౌష్టికాహారం అందిస్తోంది. విద్యార్థులకు ఇష్టమైన ఆహారం పెట్టడం, ప్రత్యేకంగా మెనూలో రాగిజావ చేర్చడంతో పోషకాలు బాగా అందుతున్నాయి. విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. రోజూ ఏదో ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తాం. నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటాం.

–గణపతి, ఎంఈఓ, గుడిపాల

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన ఉంటుందని చెప్పారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళి మోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు గుడిపాలలో..

గుడిపాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని ప్రజలు సమ్యలు ఏవైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మధు



గోవిందప్ప

బంగారుపాళెం: జిల్లాలో పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధు, గోవిందప్ప అన్నారు. జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రన్, ఉపాధ్యక్షుడు గంగరాజు సమక్షంలో కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా గోవిందప్ప, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా మారెమ్మ, రమణ, సుబ్రమణ్యం, సహాయకార్యదర్శులుగా డి సుబ్రమణ్యం, నాగరాజు, కాలేషావలి, సంపూర్ణమ్మతో పాటు 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎంఓయూను రద్దు చేసుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

చిత్తూరు రూరల్: అపోలోతో కుదుర్చుకున్న ఎంఓయూను రద్దు చేసుకోవాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ సభ్యులు సత్య, అశోక్, కుమారేషన్ డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. జిల్లా ఆస్పత్రిని నడిపిస్తున్న అపోలో సేవల్లో నాణ్యత లోపిస్తోందన్నారు. రుమటాలజీ, ట్రామాకేర్ వంటి వసతులు లేవన్నారు. మందులు, మాత్రలు బయట రాయిస్తున్నారని చెప్పారు. చిత్తూరు రైల్వే స్టేషన్ కనీస వసతులు కరువయ్యాయన్నారు. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

ఘనంగా వేపచీర్ల తిరునాళ్లు



ఆరివేణి గంగమ్మ గుడి వద్ద వేపచీర్లతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో వెలసిన ఆరివేణి గంగమ్మ గుడి వద్ద ఆదివారం సాయంత్రం వేపచీర్ల తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే ఆరివేణి గంగమ్మకు ప్రతి ఏటా ఆడి మాసంలో ఈ తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు ఒంటికి కేవలం వేపాకు మాత్రమే చుట్టుకుని అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చుతారని ప్రగాఢ విశ్వాసంతో భక్తులు వేపచీర్లు సమర్పిస్తారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మ వారికి పొంగళ్ళు పెట్టి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. తర్వాత వేపాకు ఒంటికి చుట్టూ కట్టుకొని పురుషులు, మహిళలు, పెద్దలు, పిల్లలు అమ్మ వారి గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా పశువులకు అమ్మవారు రాకుండా, ఎలాంటి రోగాలు రాకుండా కాపాడు తల్లీ అంటూ వేపాకు మెడకు కట్టి ప్రదక్షిలు చేయించి మొక్కులు తీర్చుకొన్నారు.

ముగిసిన నాగాలమ్మ జాతర

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఎస్టేట్‌లోని ఆటో నగర్‌లో నాగాలమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రీతికరమైన పదార్థాలను నైవేద్యం సమర్పించారు. పలువురు మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని నిమజ్జనం చేశారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



రోడ్డుపై నిలిచిన ఆస్పత్రి మురుగునీరు, నిలిపి ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక వీరభద్రకాలనీ ప్రభుత్వ ఆస్పత్రి వ్యర్థపు మురుగునీరు తేనెబండ రోడ్డుపై వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలోని నాగాలమ్మగుడి, నివాసాల వద్ద అపరిశుభ్రంగా మారింది. ఆస్పత్రి వెనుకవైపు ఉన్న గోడకు రంధ్రం పెట్టి వ్యర్థపు నీటిని అందులో నుంచి రోడ్డు పైకి వదిలేస్తున్నారు. ప్రైవేటు మార్చురీ అంబులెన్స్‌లు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడ మందుబాబులు, ఆకతాయిలు చేరడంతో, కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి విద్యుత్ లైన్‌కు తాకుతున్నాయి. అయినా ఆ తీగలను తొలగించడం లేదు. దోమల బెడద అధికంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ చేయడం లేదు. ఈ సమస్యలను డివిజన్ వాసులు ఎమ్మెల్యేకు తెలియజేయగా ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అయిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వీరభద్రకాలనీలో నివాసాల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు,

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గోపినాథ్, సత్యమూర్తి, మణి, చంద్ర, రమాదేవి, లత, వాసు, జయశంకర్, ఈశ్వర్, రవి, వినాయక తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై ఉన్న శ్రీవళ్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో ఆగస్టు 8, 9 తేదీల్లో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు ఆదివారం తెలిపారు. మంగళవారం భరణి, బుధవారం కృత్తిక కావళ్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అన్నదానం రెండు రోజుల పాటు కొనసాగుతందన్నారు. రాత్రి వీధి నాటకంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చని చెప్పారు.

బోయకొండ గంగమ్మా..ఆశీర్వదించమ్మా!



బోయకొండలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన క్యూలు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరొందిన శ్రీ బోయకొండ గంగమ్మ దీవెనల కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు బోయకొండకు రావడంతో జనసంద్రంగా మారింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలలో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

గుర్రప్పస్వామికి మొక్కు చెల్లింపు

తవణంపల్లె: మండలంలోని అరగొండలో నాయీ బ్రాహ్మణులు భక్తిప్రపత్తులతో గుర్రప్ప స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఆలయంలో గుర్రప్ప స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అరగొండ వాగులో పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. స్వామికి భక్తితో పూజలు చేసి, తలనీలాలు సమర్పించారు. తర్వాత భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మేళతాళాలు మంగళ వాయిద్యాలతో వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా స్వామికి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో గుర్రప్ప స్వామి, పూజా సామగ్రి, ప్రసాదాలు ఊరేగింపుగా తీసుకెళుతున్న నాయీ బ్రాహ్మణులు